



వర్క్స్ ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఆందోళనకు దిగిన కాంట్రాక్టు కార్మికులు

ఉక్కులో ఉద్రిక్తత

ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద బైఠాయింపు

- విధుల నుంచి తొలగించేందుకు యత్నించడంపై నిరసన
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది
- యాజమాన్యం నుంచి హామీ లభించకపోవడంతో రాత్రి 11 గంటలకు కూడా నిరసన కొనసాగింపు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 1:

స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఉదయం పది గంటల నుంచి ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రద్దు చేసిన గేటు పాస్‌లను పునరుద్ధరించాలని, బయోమెట్రిక్ యంత్రంలో తొలగించిన కార్మికుల వివరాలు తిరిగి నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు యాజమాన్యం నుంచి ఎటువంటి హామీ లభించకపోవడంతో రాత్రి పదకొండు గంటలకు కూడా నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్లాంటులో 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా...అందులో నాలుగు వేల మందిని తొలగించేందుకు యాజమాన్యం సిద్ధమైంది. వారి వివరాలను గత నెల 27న బయోమెట్రిక్ యంత్రాల నుంచి తొలగించింది. ఈ విషయమై చర్చించేందుకుగాను కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, కొంతమంది కార్మికులు మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఈడీ (వర్క్స్) కార్యాలయానికి వెళ్లారు. కొద్దిసేపటికి వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని ఆన్‌లైన్‌లో యథావిధిగా గేటు పాస్‌లు రెన్యువల్ చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ సమయంలో అధికారులు వచ్చి మాట్లాడేందుకు యత్నించినప్పటికీ కార్మికులు ఒప్పుకోలేదు. ముందు గేటు పాస్‌లు ఇవ్వాలని, అప్పటివరకూ మాట్లాడొద్దని అడ్డుకున్నారు. దఫదఫాలుగా కార్మిక సంఘ నాయకులతో అధికారులు చర్చలు జరిపారు. అయితే కార్మిక నాయకుల డిమాండ్‌లను యాజమాన్యం అంగీకరించకపోవడంతో రాత్రి పదకొండు కూడా గంటలకు ఆందోళన కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల ఆందోళనకు ఉద్యోగ సంఘ నాయకులు మద్దతు తెలిపి కార్యాలయం ముందు బైఠాయించారు.

తెలుపు రంగు పాస్‌లు ఇస్తామనడంతో ఆందోళన

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలల కాలపరిమితితో కూడిన పసుపు రంగు గేటు పాస్ ఇచ్చేవారు. అయితే ఇటీవల యాజమాన్యం సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికుల గేటు పాస్‌లను ఆన్‌లైన్‌లో రద్దు చేసింది. వీరికి నెల రోజుల వ్యవధితో తెలుపు రంగులో ఉండే గేటు పాస్‌లు ఇస్తామని చెప్పడంతో ఆందోళన చేపట్టారు.

ఈడీ (వర్క్స్) కార్యాలయం అద్దాలు ధ్వంసం

గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులు వేలాది మంది తరలివచ్చి అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు అక్కడ నుంచి కదిలేది లేదని ఈడీ కార్యాలయం వద్ద కూర్చున్నారు. ఒకానొక దశలో కార్యాలయం లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలకు తోపులాట చోటు చేసుకుంది. ఆ సమయంలో కొంతమంది కార్మికులు కార్యాలయంపైకి రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆందోళన క్రమంలో ఈడీ (వర్క్స్) కార్యాలయం అధికారులను, ఉద్యోగులను కాంట్రాక్టు కార్మికులు నిర్బంధించారు. కాగా కాంట్రాక్టు కార్మికుల ఆందోళనతో సౌత్ ఏసీపీ త్రినాథ్ పర్యవేక్షణలో పలు స్టేషన్‌ల సీఐలు, ... మిగతా 6వ పేజీలో

జిప్ లైనర్, స్కై సైక్లింగ్...

కైలాసగిరిపై సాహస క్రీడలకు ఏర్పాట్లు

ఇప్పటికే టవర్ల నిర్మాణం పూర్తి

రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్



కైలాసగిరిపై జిప్‌లైనర్, స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు



జిప్‌లైనర్



స్కై సైక్లింగ్

- దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటకులకు దసరా కానుక సిద్ధం చేస్తోంది. కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్కై సైక్లింగ్, జిప్ లైనర్లను ఏర్పాటు చేస్తోంది. రెండేళ్ల క్రితమే వీటికి సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరినా పనులు ముందుకుసాగలేదు. ఇటీవల కమిషనర్‌గా వచ్చిన విశ్వనాథన్ పాతవాటిని సమీక్షించి, ఆయా పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టారు. దాంతో ఈ రెండింటి పనులు ఊపందుకున్నాయి. వీటి కోసం వీఎంఆర్‌డీఏ రూపాయి కూడా పెట్టుబడి పెట్టడం లేదు. కేవలం కొండపై రెండు వేల గజాల స్థలం మాత్రమే కేటాయించింది. కేరళలో జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తున్న ఓ సంస్థ, విశాఖపట్నానికి చెందిన సాయి మోక్ష షిప్పింగ్ ఏజెన్సీ కలిసి జాయింట్ వెంచర్ కింద ఈ ప్రాజెక్టు చేపట్టాయి. వ్యయం అంతా అవే భరిస్తాయి. అందులో వచ్చే ఆదాయంలో 45 శాతం వీఎంఆర్‌డీఏకు ఇస్తాయి.

ఎక్కడి నుంచి ఎక్కడికి అంటే..?

కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహం వద్ద నుంచి విశాలాక్షి నగర్ వైపు 150 మీటర్ల పొడవున ఈ జిప్ లైనర్, స్కై సైక్లింగ్ వస్తాయి. వీటి కోసం ఇటు వైపు ఒక టవర్, అటు వైపు మరో టవర్ నిర్మించారు. కేవలం భూమి ఆకర్షణ శక్తి ఆధారంగా ఇవి పనిచేస్తాయి. ఎటువంటి విద్యుత్ మోటార్లు ఉండవు. ఇక్కడ నుంచి జిప్ లైనర్‌ను వదిలితే డౌన్‌గా ఉండడం వల్ల కిందకు ... మిగతా 6వ పేజీలో

హార్బర్ ఏసీపీ మోసేజ్‌పాల్ సస్పెన్షన్

- డీజీపీ ఉత్తర్వులు
- అవినీతి ఆరోపణలపై సీపీ విచారణ
- వాస్తవమేనని తేలడంతో డీజీపీకి నివేదిక

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో హార్బర్ ఏసీపీగా పనిచేస్తున్న మోసేజ్‌పాల్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి.



మోసేజ్‌పాల్

తన సబ్ డివిజన్ పరిధిలో స్టేషన్లకు వచ్చే ముఖ్యమైన కేసులను కొంతమంది కానిస్టేబుళ్ల ద్వారా తన వద్దకు తెప్పించుకుంటారని, సివిల్ కేసుల్లో తలదూర్చి సెటిల్‌మెంట్‌లు చేస్తుంటారని, చీటింగ్ కేసులకు సంబంధించి ఫిర్యాదులు వస్తే అవతలి వారిని పిలిచి బెదిరించి డబ్బులు గుంజుతుంటారని, పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం కారణంగా కార్మికులు మరణిస్తే సంబంధిత కాంట్రాక్టర్లు, కంపెనీల ప్రతినిధులను పిలిచి డబ్బులు వసూలు చేస్తుంటారనే ఆరోపణలు మోసేజ్‌పాల్‌పై ఉన్నాయి. తన దందాకు అడ్డుపడుతున్నారని కక్ష కట్టి మల్కాపురం సీఐగా పనిచేసిన సన్యాసినాయుడును వేధించారని పోలీస్ శాఖలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నుంచి తప్పిస్తానని చెప్పి ఒకరి వద్ద రూ.2.5 లక్షలు వసూలు చేశారని, కానీ పని జరగకపోవడంతో బాధితుడు నేరుగా సీపీ శంఖబ్రతబాగ్చిని కలిసి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనిపై సీపీ ప్రత్యేకంగా విచారణ నిర్వహించగా వాస్తవమేనని తేలడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ ద్వారకా తిరుమలరావుకు నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో మోసేజ్‌పాల్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీచేశారు. కాగా మోసేజ్‌పాల్‌కు రెండు నెలల కిందటే బదిలీ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాలేదు. ఇదిలావుండగా మోసేజ్‌పాల్ సస్పెన్షన్ గురించి సీపీ శంఖబ్రతబాగ్చి వద్ద ప్రస్తావించగా అనేక అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపానన్నారు. విచారణలో ఆరోపణలన్నీ వాస్తవమేననితేలడంతో డీజీపీకి నివేదిక పంపించానన్నారు. పోలీస్ శాఖలో ఎవరు అవినీతికి పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి నిస్వార్థంగా, నిజాయితీగా సేవలు అందించాల్సిందేనని సీపీ స్పష్టంచేశారు.

చురుగ్గా ఈఎస్ఐ ఆస్పత్రి పనులు

8.58 ఎకరాల్లో రూ.384.26 కోట్లతో నిర్మాణం



షీలానగర్‌లో జరుగుతున్న ఈఎస్ఐ ఆస్పత్రి పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రాలోని ఉద్యోగులు, కార్మికులకు ఉపయోగపడేలా షీలానగర్‌లో జాతీయ రహదారికి సమీపాన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ఆస్పత్రి రూపుదిద్దుకుంటోంది. దీనిని 8.58 ఎకరాల్లో, రూ.384.26 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. వాస్తవానికి ఇది ఎప్పుడో పూర్తి కావలసిన ప్రాజెక్టు. భూ కేటాయింపులో సమస్యల వల్ల తీవ్ర జాప్యం జరిగింది.

బీజేపీ నాయకులు ఎం.వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా పనిచేసిన కాలంలో ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరుచేసి 2016 ఏప్రిల్ 11న మరో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయతో కలిసి శంకుస్థాపన చేశారు. అయితే భూ సమస్య వల్ల పనులు ప్రారంభం కాలేదు. బీజేపీ నాయకులు ఢిల్లీ స్థాయిలో మాట్లాడి 2023 ఏప్రిల్ 10న పనులు ప్రారంభమయ్యేలా చేశారు. అంటే శంకుస్థాపన జరిగిన ఏడేళ్లకుగానీ పునాదులు తవ్వలేదు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి పూర్తి నిధులు కేంద్రం మంజూరుచేసింది. నిర్మాణ బాధ్యతలను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ విభాగానికి అప్పగించింది. ఇక్కడ 350 పడకల ఆస్పత్రి, మరో 50 పడకలతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మిస్తారు. దీనిని 2025 అక్టోబరు నాటికి పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించారు.

350 పడకలు

- మరో 50 పడకలతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్
- వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పూర్తిచేయాలని లక్ష్యం

30 శాతం పనులు పూర్తి

ఈ ఏడాదిన్నర కాలంలో భూమిని చదును చేసి, పునాదులు తీసి, బ్లాకులుగా విడదీసి మార్చురీ బ్లాక్‌ను శ్లాబ్ లెవెల్ వరకు పూర్తిచేశారు. ఆస్పత్రి ప్రధాన భవన నిర్మాణం 30 శాతం వరకు పూర్తయ్యింది. సర్వీస్ టన్నెల్, ఆస్పత్రి లోపలకు రావడానికి, బయటకు వెళ్లడానికి అవసరమైన టన్నెల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ పూర్తయింది.

అన్ని వసతులు ఇక్కడే

విశాఖ ప్రాంత ఉద్యోగులు, కార్మికుల కోసం మల్కాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రిని ... మిగతా 6వ పేజీలో

మసాజ్ సెంటర్లలో తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మసాజ్ సెంటర్లలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సుమారు 200 మంది బృందాలుగా విడిపోయి నగరంలోని 83 స్పా/మసాజ్ సెంటర్లలో తనిఖీలకు ఉపక్రమించారు. అయితే వాటిలో 31 మాత్రమే తెరిచి ఉండగా, 52 కేంద్రాలు మూసివున్నాయి. తనిఖీ చేసిన వాటిల్లో రెండింటికి లేబర్ సర్టిఫికెట్ లేదని, 25 కేంద్రాలకు ఫైర్ ఎన్‌ఓసీ లేదని, పది స్పా/మసాజ్ కేంద్రాలకు ట్రేడ్ లైసెన్స్ లేదని, 18 సెంటర్లకు జీఎస్టీ సర్టిఫికెట్ లేదని, ఒక కేంద్రంలో సీసీ కెమెరాలు లేవని పోలీసుల తనిఖీల్లో తేలింది. అలాగే ఒక కేంద్రంలో నలుగురు విదేశీ యువతులు పనిచేస్తుండగా, మరొకచోట పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతి ఉన్నట్టు గుర్తించారు. మూడు స్పా/మసాజ్ కేంద్రాల్లోని గదుల్లో తలుపులకు గడియ ఉన్నట్టు గుర్తించారు. దీనిపై ... మిగతా 6వ పేజీలో



మసాజ్ సెంటర్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పింఛన్ల పంపిణీ 97.39 శాతం పూర్తి

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మంగళవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగించారు. పింఛనుదారుల్లో 97.39 శాతం మందికి సొమ్ము అందజేశారు. బుధవారం...గాంధీ జయంతి సందర్భంగా సెలవు కావడంతో మిగిలిన వారికి మూడో తేదీ అంటే గురువారం అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. అక్టోబరుకు సంబంధించి జిల్లాలో 1,62,490 మందికి రూ.69,81,00,500 పంపిణీ చేయాల్సి ఉండగా, వారిలో 1,58,244 మందికి రూ.67,96,43,000 అందించారు.



సమీక్షలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, చిరంజీవిరావు, జీవీఎంసీ కమిషనర్, సంపత్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీలో 'దేశం' ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్

భవిష్యత్తు అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు

- విశాఖను మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత జీవీఎంసీదే
- అధికారులతో సమీక్షలో ఎంపీ ఎం.శ్రీభరత్
- కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తెస్తా
- 2026 నాటికి మురుగునీరు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి
- నగర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):

విశాఖను మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యతను జీవీఎంసీ అధికారులే తీసుకోవాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ పరిధిలో అమలవుతున్న ప్రాజెక్టులు, నగరంలోని సమస్యల పరిష్కారంపై ఆయన మంగళవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సర్క్యూట్‌హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగర భవిష్యత్తు అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసేందుకు జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు జీవీఎంసీ ... మిగతా 6వ పేజీలో



తెలంగాణ డీఎస్సీలో సత్తాచాటిన విశాఖ యువతి

- స్కూల్ అసిస్టెంట్ (హిందీ), లాంగ్వేజ్ పండిట్ (హిందీ)లో ప్రథమ స్థానంలో నిలిచిన రెడ్డి మహాలక్ష్మి

- మెయిన్ 3లో

నేటి నుంచి వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ టోర్నీ

- వార్త I పేజీలో

మొబైల్ అప్పగింత

విశాఖపట్నం, అక్టోబరు 1: సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై జేబు నుంచి మొబైల్ (వీవో) జారవిడుచుకున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చవిదాస్‌కు ఆర్పీఎఫ్ సిబ్బంది తిరిగి మొబైల్ ఫోన్‌ను అప్పగించారు. ప్లాట్‌ఫామ్‌పై పెట్రోలింగ్ చేస్తున్న సోనాలి సోలంకి అనే ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్‌కు మొబైల్ కనిపించింది. దానిని పరిశీలిస్తున్న సమయంలో బాధితుడి నుంచి ఫోన్ వచ్చింది. ఆమెకు జరిగిన సంఘటన చెప్పగా వివరాలు నిర్ధారించుకుని ఆర్పీఎఫ్ సిబ్బంది, బాధితుడి బంధువు రోహిత్‌కు మొబైల్ అప్పగించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్షలు


పుట్టి బంగారమ్మవారి దేవాలయం దగ్గర దీక్షలో మహిళల మంత్ర జపం


శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో జనసేన నాయకులు, మహిళల పూజలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 1: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు ప్రసాదం అపవిత్రం జరిగిందని భావిస్తున్న నేపథ్యంలో స్వామివారికి ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ చేపట్టిన 11 రోజుల దీక్షకు మద్దతుగా గ్రేటర్ 42, 43, 44 వార్డులు సంయుక్తంగా నమో నారాయణాయ మంత్ర జపం 80 అడుగుల రోడ్డులోని పుట్టి బంగారమ్మవారి దేవాలయం దగ్గర మంగళవారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథిగా ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, వార్డుల అధ్యక్షులు గారపాటి లక్ష్మి, వరలక్ష్మి, దివాకర్, భాస్కర్, త్రినాథ్ పాల్గొన్నారు.

మర్రిపాలెం: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా 53, 54 వార్డుల జనసేన నాయకులు, వీరమహిళలు పంజాబ్ హోటల్ దరి సాయినగర్‌లో గల శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డుల జనసేన అధ్యక్షులు నీరుకొండ దివాకర్, వింజమూరి భాస్కర్, తాటిపాకల మాణిక్యాలరావు, పెద్దసంఖ్యలో వీరమహిళలు పాల్గొన్నారు.

అల్లిపురం: తిరుమల శ్రీవారి లడ్డును అపవిత్రం చేసిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు పలుకుతూ మంగళవారం స్థానిక 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయంలో దీపారాధన చేపట్టారు. కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, దక్షిణ జనసేన నాయకులు గోపీ కృష్ణ, వార్డు జనసేన అధ్యక్షుడు ఆకుల రాజుల ఆధ్వర్యంలో దీపారాధన చేశారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నీలమ్మ తల్లి సేవాసమితి కమిటీ సభ్యులు అప్పల రాజు, గణేష్, శ్రీను, వార్డు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అపుస్మా అధ్యక్షునిగా సత్యనారాయణ



అక్కయ్యపాలెం, అక్టోబరు 1: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మెనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షునిగా అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఆయన అపుస్మా ప్రతినిధిగా చక్కని సేవలందించారు. ఎన్నికల అధికారిగా అపుస్మా మెంటర్ ఎ.కృష్ణారెడ్డి వ్యవహరించారు. ఆయన 2026 వరకు అధ్యక్ష పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు శక్తివంచన లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్సలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: పాండురంగాపురం బీచ్‌రోడ్డు ఏయూ యోగా విలేజ్‌లో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రమేష్‌బాబు తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యం చేస్తారన్నారు. కేజీహెచ్ పూర్వ సీనియర్ వైద్యాధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. గతంలో వైద్యులు రాసిన చీటీలు శిబిరానికి తీసుకురావాలని సూచించారు.

మెగా రక్తదాన శిబిరం

అల్లిపురం, అక్టోబరు 1: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు జనసేన నాయకులు, ఫౌండేషన్ అధినేత భీశెట్టి గోపీకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి హాజరవుతారని చెప్పారు.

కనకమహాలక్ష్మికి కుంకుమార్చనలు

పూర్ణామార్కెట్, అక్టోబరు 1: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు జరిపి అమ్మవారికి అష్టదళ పద్మారాధన సేవల్లో భాగంగా 108 బంగారు పుష్పాలతో భక్తుల సమక్షంలో పూజలు చేశారు. దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

మిథున్‌కు వీఎఫ్ఎస్ అభినందనలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: భారతీయ సినిమా పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే దాదాసాహెబ్ పాల్కే అవార్డుకు ప్రఖ్యాత సినీనటుడు మిథున్ చక్రవర్తిని ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం హర్షణీయమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ అవార్డుకు మిథున్ అన్ని విధాలా అర్హులని తెలిపారు .కేంద్రమంత్రి ప్రకటనపై వైజాగ్ ఫిల్మ్ సొసైటీ శుభాకాంక్షలు తెలియజేస్తుందన్నారు. మిథున్‌కు అభినందనలు తెలియజేస్తూ మెయిల్ పంపామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

మర్రిపాలెం, అక్టోబరు 1: కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురిని ఐదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం హాజరుపరచగా ఆరుగురికి రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష విధించారని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సెలవు ప్రకటనపై హర్షం

సీతమ్మధార, అక్టోబరు 1: సీతమ్మధార రైతు బజార్‌కు మంగళవారం సెలవు ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సెలవు కావడంతో బజారును కడిగి శుభ్రం చేశారు.

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలు వద్దు'

అక్కయ్యపాలెం, అక్టోబరు 1: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజారు రోడ్డులో మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రజా ఆస్తులైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ పరిశ్రమలను బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మకానికి పెట్టి దేశసంపదను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. బొగ్గు ముడి సరకును ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, జి.శ్రీనివాస్, పి.సాయికుమార్, జి.గణేష్, ఎరుకునాయుడు, సూరిబాబు, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలను విజవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్‌కే కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలు నిలిపివేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాల నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.టి.ప్రసాద్

మురళీనగర్, అక్టోబరు 1: జన సమ్మర్థ ప్రాంతాలుగా ఉండే హోటళ్లలో నిర్వాహకులు కచ్చితమైన ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని జిల్లా సహాయ అగ్ని మాపకశాఖ అధికారి కె.వి.టి.ప్రసాద్ సూచించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలోని మారియట్ త్రీస్టార్ హోటల్ వద్ద మంగళవారం మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద నివారణ సాధనాలు అందుబాటులో ఉంటే అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు త్వరితగతిన ఎలా బయటపడవచ్చునో సిబ్బందితో చేపట్టిన మాక్‌డ్రిల్‌లో చూపించారు. హోటల్ సిబ్బందిని సమావేశ పరచి తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్‌మెన్ చిరంజీవి, ఆర్.చిన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉద్యోగులు, సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్ నూతన ప్రణాళికలు, ఇతర అంశాలను ప్రజలకు తెలియజేసేలా ర్యాలీ చేపట్టారు. ఏజీఎం టీడీ పాల్ విలియమ్స్ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీజీఎం (ఆపరేషన్స్) జి.ఆడమ్స్, డీజీఎంలు ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, బీవీవీ నగేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

దొండపర్తి, డాబాగార్డెన్స్, సీతంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం దొండపర్తి, డాబాగార్డెన్స్, సీతంపేట ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు గొలగాని వీరారావు బుజ్జి సారపిల్లి గోవింద్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఇతర అధికారుల బృందం, వార్డు టీడీపీ అధ్యక్షులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండె పరిరక్షణకు వ్యాయామం అవసరం


వాక్‌థాన్‌లో పాల్గొన్న గుండె వైద్యనిపుణులు, వైద్యవిద్యార్థులు, స్థానికులు

మహారాణిపేట, అక్టోబరు 1: మహిళలు, యువతలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, వీటి నివారణకు వ్యాయామం అవసరమని ప్రముఖ కార్డియాలజిస్ట్, మహిళా వైద్య నిపుణురాలు వి.సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డే వారోత్సవాల సందర్భంగా ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు అవగాహన కల్పిస్తూ 'గుండె కోసం నడక' (వాక్ ఫర్ హార్ట్) లక్ష్యంతో మంగళవారం సాగరతీరంలో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. డాక్టర్ సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇంటి పనులతోనే వ్యాయామం అయిపోతుందని భావిస్తున్నారని, కాని ఇకపై నడక వంటి వ్యాయామం చేయక తప్పదని ఆమె అన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లతోనే ప్రమాదమని భావిస్తున్నారని, ఇకపై గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకత ఏర్పడిందని స్పష్టంచేశారు. మద్యపానం, ధూమపానం, తీవ్రమైన ఒత్తిడి, వ్యాయామం లేకపోవటంతో యువతకు గుండెపోటు సమస్య పెరిగినట్లు తేలిందన్నారు. ప్రజలను చైతన్యపరచడానికే వాక్‌థాన్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె వ్యాధులను మాత్రమే ముందుగా గుర్తించి ప్రమాదాన్ని నివారించగలమన్నారు. ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ అనిల్‌కుమార్ మహాపాత్రో, కార్డియోథొరాసిక్ అండ్ ఎండో వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ హరివదన్ లుక్కా, డాక్టర్ జాన్ ఎస్ వెస్లీ, ఇండస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎస్.శ్రీధర్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వేలో ఇకపై స్వచ్ఛతా పక్వాడా

విశాఖపట్నం, అక్టోబరు 1: వాల్తేరు రైల్వేలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ గత నెల 14 నుంచి స్వభావ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత పేరిట నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ముగించి, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 15 వరకు కొనసాగే స్వచ్ఛతా పక్వాడాలో రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాలు, వర్క్‌షాపులు, నిర్వహణ డిపోలు, ఆసుపత్రులు, రైల్వే నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించి క్లీన్ అండ్ గ్రీన్ ఇండియాపై అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. కేవలం వాల్తేరు డివిజన్‌లోనే కాకుండా తూర్పుకోస్తారైల్వే జోన్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం తమ ప్రాంగణాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రతను పాటించడంపై అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

'పోర్టు ఆసుపత్రి కోసం ఉద్యమించాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 1 : పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ కాకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. స్థానిక నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు ఆసుపత్రి వద్ద మంగళవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రస్తుతం 80 పడకలతో దశాబ్దాల తరబడి 35 వేల కుటుంబాలకు సేలందిస్తోందని గుర్తు చేశారు. దీన్ని పీపీపీ పద్ధతిలో 300 పడకలతో ప్రైవేటు వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. సీఐటీయూ నాయకులు పద్మనాభరాజు, కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, వీర రాఘవులు, రామారావు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు అవసరం'

జగదాంబ కూడలి, అక్టోబరు 1: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ 4న నగరంలోని ఆశీలుమెట్ట, ద్వారకానగర్, సెంట్రల్ పార్క్ జీవీఎంసీ, గాంధీ విగ్రహం వరకు భవన నిర్మాణ కార్మికులతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

రైతుబజార్లలో ఖాళీ స్టాళ్ల కేటాయింపునకు 5న డ్రా

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న తొమ్మిది రైతు బజార్లలో సాయంత్రం పూట వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకోవడానికి రైతులకు అవకాశం కల్పించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం తెలిపారు. ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, సీతమ్మధార, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ, నరసింహనగర్, గాజువాక రైతుబజార్లలో 238 దుకాణాలు (స్టాళ్లు) ఖాళీగా ఉన్నాయన్నారు. రైతుబజార్లలో అవకాశం కోసం 2019 నుంచి వివిధ ప్రజాప్రతినిధుల ద్వారా 673 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, వారందరి పేర్లతో ఈ నెల 5న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో డ్రా తీసి 238 మందికి అవకాశం కల్పిస్తామన్నారు. ఎంపికైన రైతులకు నామినీగా ఉండటానికి రక్తసంబంధీకులు మాత్రమే అర్హులని, వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఎంపికైన వారు సాయంత్రం పూట మాత్రమే బజార్లలో విక్రయించాల్సి ఉంటుందన్నారు. డ్రా తీయబోయే జాబితా కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.విశాఖపట్నం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూడవచ్చన్నారు.

చురుగ్గా ఈఎస్ఐ ఆస్పత్రి పనులు

... 5వ పేజీ తరువాయి

సుమారు రూ.28 కోట్లతో ఆధునీకీకరించారు. అయితే షీలానగర్ ఆస్పత్రికి ఎవరైనా ఏదైనా ఆరోగ్య సమస్యపై వస్తే పరీక్షలకు గానీ, ఆపరేషన్లకు గానీ బయటకు వెళ్లకుండా అన్ని సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎవరికైనా ఎంఆర్ఐ స్కాన్, పెద్ద పెద్ద ఆపరేషన్లు అవసరమైతే మల్కాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కార్పొరేట్ ఆస్పత్రులకు పంపుతున్నారు. షీలానగర్ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఎంఆర్ఐ స్కానింగ్ అక్కడే చేస్తారు. అన్నిరకాల ఆపరేషన్లు నిర్వహిస్తారు.

త్వరలోనే తొలి బ్లాక్ ప్రారంభం

షీలానగర్ ఆస్పత్రి నిర్మాణం శరవేగంతో నిర్మాణం జరుగుతోంది. ఆస్పత్రి మొత్తం పూర్తయ్యేంత వరకు ఆగకుండా అందుబాటులోకి వచ్చిన భవనాలను వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము. ఏ బ్లాక్ ముందుగా పూర్తవుతుందో దానిని ప్రారంభించి సేవలు ప్రారంభించే యోచన ఉంది.

\- పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ

జిప్ లైనర్, స్కై సైక్లింగ్...

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోతుంది. అక్కడ దిగిన తరువాత దాని కంటే ఎత్తుగా నిర్మించిన టవర్ ఎక్కి అక్కడి నుంచి ఇటు వైపు మళ్లీ డౌన్‌కు గ్రావిటీతో వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కైలాసగిరి కిందన రోప్ వే ఉంది. ఇది విద్యుత్ మోటార్లతో పనిచేస్తుంది. కానీ జిప్ లైనర్లు కేవలం గ్రావిటీ ఆధారంగానే పనిచేస్తాయి.

జిప్ లైనర్ అంటే...: రెండు టవర్ల మధ్య తీగ కడతారు. దానికి బేరింగ్స్‌తో నడిచే రోప్స్ వేలాడదీస్తారు. వాటిని పర్యాటకుల నడుముకు బిగిస్తారు. జారిపోకుండా పటిష్ఠంగా కడతారు. వాటిని వదలగానే ఇటు వైపు నుంచి అటు వెళతాయి. అలాగే అటు వదిలితే ఇటు వస్తాయి. గాలిలో వేలాడుతూ వెళ్లిన అనుభూతి కలుగుతుంది.

స్కై సైక్లింగ్..: టవర్లకు మధ్య తీగలు ఏర్పాటుచేసి, వాటిపై సైకిళ్లు నడిచేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ సైకిళ్లకు టైర్లు ఉండవు. తీగలపై బ్యాలెన్స్ అయ్యేలా రిమ్స్ మాత్రమే ఉంటాయి. వీటికి కిందన ఒక తీగ, పైన ఒక తీగ ఉంటాయి. సైకిల్‌పై పర్యాటకులు కూర్చొంటారు. ఇవి కూడా గ్రావిటీతోనే నడుస్తాయి. జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌లలో ఏది ఎక్కినా ఇటు నుంచి అటు వెళ్లి, తిరిగి అటు నుంచి ఇటు వచ్చేలా అనుమతిస్తారు. కైలాసగిరి రోప్‌వేకు ఆ సదుపాయం లేదు. ఇటు నుంచి కొండపైకి వెళ్లి అటు నుంచి రోడ్డు మార్గాన దిగిపోవలసి ఉంటుంది. అటు నుంచి కూడా రోప్‌వేలోనే రావాలంటే ప్రత్యేకంగా టికెట్ తీసుకోవలసి ఉంటుంది. వీటికి మాత్రం అలా కాకుండా ఇక్కడ జిల్ లైనర్ లేదా స్కై సైక్లింగ్ ఎక్కిన వారు అటు నుంచి వెనక్కి వచ్చే అవకాశం కల్పిస్తున్నారు.

టికెట్ ధరపై నిర్ణయం కమిషనర్‌దే

ఈ తరహా జిప్ లైనర్లు, స్కై సైక్లింగ్‌లకు కేరళలో మనిషికి రూ.150 చొప్పున టికెట్ పెట్టి వసూలు చేస్తున్నారు. ఇక్కడ టికెట్ ధర ఎంత అనేది వీఎంఆర్‌డీఏ కమిషనరే నిర్ణయిస్తారని ఈ పనులు పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బలరామరాజు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్ నడిపి, దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

ఉక్కులో ఉద్రిక్తత...

5వ పేజీ తరువాయి

ఎస్ఐలు, సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది భారీగా మోహరించారు.

కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు

- ఆన్‌లైన్‌లో రద్దు చేసిన గేటు పాస్‌లను తక్షణమే పునరుద్ధరించాలి
- బయోమెట్రిక్ యంత్రంలో వివరాలు తిరిగి నమోదు చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి, ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలి, పాత పద్ధతిలోనే గేటు పాస్‌లు మంజూరుచేయాలి, పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలి, యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది **-అఖిలపక్ష కార్మిక నాయకులు**

కాంట్రాక్టు కార్మికుల విషయంలో యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈడీ (వర్క్స్) కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్మిక వర్గాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ యాజమాన్యం చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేదని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికుల విషయంలో కుట్ర జరుగుతుందన్నారు. భారీ ఉద్యమాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆందోళనలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, పీవీ నగేష్, శ్రీనివాసరావు, అవతారం, ఎల్.సోంబాబు, నమ్మి రమణ, రామిరెడ్డి, ఉరుకూటి వెంకటరమణ, ఉద్యోగ సంఘ నాయకులు కేఎస్ఎన్ రావు, అయోధ్యరాం, బొడ్డు పైడిరాజు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లలో తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

నివేదిక తయారుచేసి జీవీఎంసీతోపాటు అగ్నిమాపక శాఖ, జీఎస్టీ అధికారులకు పంపిస్తామని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. స్పా/మసాజ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్టయితే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

భవిష్యత్తు అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ పి.సంపత్‌కుమార్ నగరంలో చేపట్టిన ప్రాజెక్టులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. జీవీఎంసీ ఆదాయ, వ్యయాలతోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, నగరంలో రోడ్ల అభివృద్ధి, నీటి సరఫరా ప్రణాళికలు, క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, యూసీడీ విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ నగరంలో ప్రతి కుటుంబానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరమంతా వీధి దీపాలు వెలిగేలా చూడడంతోపాటు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన 157 చోట్ల కొత్తగా లైట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం అవసరమైనా నిధుల సమస్య ఉందని ఎంపీకి కమిషనర్ వివరించగా, కేంద్రంతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడలను ప్రోత్సహించడం కోసం 'ఖేలో ఇండియా' కింద కేంద్రం నుంచి నిధులను రాబట్టేందుకు కృషిచేస్తానన్నారు. గెడ్డల ఆక్రమణకు అడ్డుకట్ట వేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం కృషిచేయాలని ఎంపీ సూచించారు. డ్రైనేజీల నుంచి మురుగునీరు సముద్రంలో కలుస్తోందని, 2026 నాటికి దీనికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. గ్రామకంఠంలో ఉండే ఇళ్లకు ఆస్తి పన్ను విధించే అవకాశాలు పరిశీలించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులకు కారణమవుతున్న బడ్డీలు తొలగించాలని, జీవీఎంసీ స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన ముఖ్యమైన ప్రాజెక్టులపై నివేదిక ఇస్తే సీఎస్ఆర్ ద్వారా నిధుల సమీకరణకు కృషిచేస్తామన్నారు. యూసీడీ ద్వారా టిడ్కో ఇళ్లను అరులకు సత్వరం అందజేయాలని ఆదేశించారు. ఫుడ్ కోర్ట్‌లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీవీఎంసీ వెబ్‌సైట్, చాట్‌బాట్‌ను మెరుగ్గా నిర్వహించేందుకు యువత నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నగర అభివృద్ధికి తమ సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు సమస్యలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పెతకంశెట్టి గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


సిస్టమ్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

టెట్ కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

పెదగంట్యాడ, అక్టోబరు 1: వికాస్‌నగర్‌లోని టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం పరిశీలించారు. వికాస్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీస్‌ను ప్రభుత్వం టెట్ కేంద్రంగా ఎంపిక చేయడంతో ఆమె పరిశీలించారు. ఈ కేంద్రంలోని సిస్టమ్స్ పనితీరు, విద్యార్థులకు వసతులు వంటి వాటిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ నెల మూడు నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆమె ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ నిర్వాహకులతో మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. డీఈవో వెంట ఎంఈవో కె.రమణాజీ, ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ హెడ్ జి.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

'వైసీపీ పాలనలోనే అందరికీ మేలు'


మళ్ల విజయప్రసాద్‌ను సత్కరించిన కార్పొరేటర్లు, తదితరులు

మల్కాపురం, అక్టోబరు 1: వైసీపీ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, కూటమి ప్రభుత్వ అందరికీ అన్యాయం చేస్తుందని పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ మళ్ల విజయప్రసాద్ అన్నారు. శ్రీహరిపురంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏడు వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కుతంత్ర రాజకీయాలను ఎదుర్కొని ముందుకు వెళ్లాలని, అప్పుడే వైసీపీకి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను జనంలోకి తీసుకువెళ్లి వైసీపీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పీవీ సురేశ్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, కొణతాల సుధ, మాజీ కార్పొరేటర్ పిల్లా కనకరాజు, నాయకులు గులిగిందల కృష్ణ, జి.వెంకట సత్యనారాయణ రాజు (వాసు), పి.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. తొలుత మళ్ల విజయప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో నాగుపాము పట్టివేత

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 1: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్- 11లోని 111-ఎ క్వార్టర్స్‌లో మంగళ వారం నాగుపాము కలకలం సృష్టించింది. క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఉక్కు అధికారి ఎల్.రవీంద్రబాబు ఇంటి ఆవరణలో ఉదయం సుమారు ఎనిమిది అడుగుల నాగుపాము కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులతో పాటు చుట్టపక్కల ఉన్న కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి దాదాపు రెండు గంటలపాటు శ్రమించి పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


పట్టుకున్న పాముతో స్నేక్ క్యాచర్ కిరణ్

విజ్ఞాన్‌లో రక్తదాన దినోత్సవం

అగనంపూడి, అక్టోబరు 1: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ రక్తదాన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ బ్లడ్ క్లబ్ సెంటర్, వందేభారత్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ జె.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం పలువురు విద్యార్థులతో పాటు అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, రెక్టార్ వి.మధుసూదనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సత్యం సుందరం:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 52, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 46 దొండకాయలు 42, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 90, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 36, కీరదోస 28, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 66, దేముడుచిక్కుడు 68, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

భక్తుల కొంగుబంగారం సాగరగిరి కనకదుర్గమ్మ

రేపటి నుంచి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు

పటిష్ఠ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు

భక్తుల రాకపోకల కోసం బోట్ల సదుపాయం

మల్కాపురం, అక్టోబరు 1: భక్తుల కొంగుబంగారంగా యారాడ కొండపై కొలువుదీరిన సాగరగిరి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అమ్మవారిని సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉంది. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు కోసం బోట్లు..

సాగరగిరి కనకదుర్గమ్మ దర్శనానికి నగరం నుంచే విచ్చేసే భక్తులు పోస్టాఫీసు సమీపంలో గల పోర్టు జట్టీ నుంచి షిప్‌యార్డు జట్టీకి అమ్మవారి భక్తుడు గుప్తా ప్రత్యేకంగా బోట్ల సదుపాయం కల్పిస్తున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకు ఈ బోట్లు అందుబాటులో ఉంటాయని, ఒక్కో ప్రయాణికుని నుంచి రూ.20 చార్జి వసూలు చేయనున్నారు. ఐదు నిమిషాలకొకసారి ఈ బోటు సౌకర్యం ఉంటుంది. అలాగే షిప్‌యార్డు జట్టీకి చేరుకున్న భక్తులు ఆలయానికి చేరుకునేలా నిర్వహకులు ప్రత్యేకంగా మూడు ఆటోలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా గాజువాక డిపో నుంచి ఆలయం వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆర్టీసీ డీఎంకు లేఖ రాశారు. రోడ్డు మార్గం గుండా ఆలయానికి వచ్చేవారు సింధియా జంక్షన్‌కు చేరుకుని, ఇక్కడ నుంచి ప్రైవేటు వాహనాల ద్వారా నేరుగా టెంపుల్‌కు చేరుకోవచ్చు. ఉత్సవాల్లో భాగంగా రోజూ మధ్యాహ్నం భక్తులకు మల్కాపురానికి చెందిన మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపడుతున్నారు.

ఇదీ అమ్మవారి చరిత్ర..

విశాఖ పోర్టు నిర్మాణ సమయం (1970)లో చానల్ డెవలప్‌మెంట్ పనుల్లో భాగంగా పెద్ద నౌకలు వచ్చేందుకు వీలుగా సముద్రంలో తవ్వకాలు జరుపుతుండగా సంబంధిత కాంట్రాక్టరుకు అమ్మవారు కలలో కనిపించి తవ్వకాలు చేస్తున్న మట్టిలో తన విగ్రహం, పాదాలు ఉన్నాయని తెలిపింది. అమ్మవారు


సాగరగిరిపై పూజలందుకుంటున్న కనకదుర్గ

చెప్పినట్టే అవి కనిపించడంతో ఈ విషయాన్ని పలువురు పెద్దలు కంచి కామకోటి పీఠాధిపతుల దృష్టికి తీసుకువెళ్లారు. అమ్మవారి పాదాలు, విగ్రహనికి పూజలు చేశాక రుద్రాక్షలను తూర్పువైపు సముద్ర తీరానికి దూరంగా విసరడంతో అవి యారాడ కొండపై తూర్పు వైపున పడ్డాయి. అవి పడినచోట కంచి కామకోటి పీఠాధిపతుల సూచనల మేరకు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 200 మీటర్ల ఎత్తులో ఉంటుంది. శ్రీలంకలో కూడా ఇదే తరహాలో అమ్మవారి విగ్రహాలు ఉన్నాయి. కాగా ఆలయం చుట్టూ పలు ప్రాంతాల్లో వివిధ పేర్లతో విరాజిల్లుతున్న అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించడం విశేషం. అలాగే ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, వినాయకులు, శివాలయాలు ఉన్నాయి.


సాగరగిరికి మెట్ల మార్గం


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి | ఇంటక్ ఏపీ, తెలంగాణ ఉపాధ్యక్షుడు ముత్యాలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 1: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేసి సెయిల్‌లో విలీనం చేయాలని ఇంటక్ ఏపీ, తెలంగాణ ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీక రణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,328వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు తమ వైఖరికి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకు ఉక్కు యాజమాన్యం సుమారు నాలుగు వేల మంది కార్మికులకు ఉద్వాసన పలకాలని చూడడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాలను ఉద్యమాలతో ప్రతిఘటిస్తామన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు సంక్షోభానికి కేంద్ర విధానాలే కారణమన్నారు. కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ఉద్యమాలతోనే కాపాడుకుంటా మన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జెర్రిపోతుల ముత్యాల

డ్రోన్లతో దోమలపై సమరం

చెరువుల్లో మందును స్ప్రే చేసిన జీవీఎంసీ సిబ్బంది

పెందుర్తి-రూరల్, అక్టోబరు 1: నీటి నిల్వలు అధికంగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో దోమల మందును స్ప్రే చేసి వాటిని నిర్మూలించే కార్యక్రమానికి జీవీఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 95వ వార్డు పరిధి పురుషోత్తపురం ఎంకప్ప చెరువు, లక్ష్మీపురం రాముడు చెరువుల్లో మంగళవారం డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ (దోమల మందు)ను స్ప్రే చేశారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల వల్ల ప్రబలే సీజనల్ వ్యాధులను నివారించడానికి మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రోన్ల సహాయంతో క్రిమి సంహారక మందులను స్ప్రే చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, కాలనీల సంఘాల ప్రతినిధులు రమణమూర్తి, సత్యనారాయణ, వెంకటరావు, ప్రభు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో..

పెందుర్తి: గ్రేటర్ 97వ వార్డు పరిధి చినముషిడివాడలోని శ్రమశక్తినగర్, కార్మిక నగర్ ప్రాంతాల్లో గల చెరువుల్లో డ్రోన్ సాయంతో దోమల మందును స్ప్రే చేశారు. కార్పొరేటరు శేనపతి వసంత శంకరరావు ఈ ప్రకియను ప్రారంభించగా, కాలనీ సంఘాల ప్రతినిధులు శంకరప్రసాద్, రమణమూర్తి, రమణ, మంగరాజు, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.


పురుషోత్తపురం ఎంకప్ప చెరువులో డ్రోన్‌తో దోమల మందు చల్లుతున్న చేస్తున్న దృశ్యం

చురుగ్గా సాగిన పింఛన్ల పంపిణీ


గొల్ల నారాయణపురంలో లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, అక్టోబరు 1: జీవీఎంసీ 93వ వార్డు పరిధి గొల్లనారాయణపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీనే ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల వద్ద లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గడిచిన వంద రోజుల పాలనలో సీఎం చంద్రబాబు హయాంలో ఎన్నో హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కె.హైమావతి, కూటమి నాయకులు బంటు సురేశ్, బల్ల రవి, పిన్నింటి పార్వతి, రాపర్తి కన్నా శైలజ, ఎస్.శోభారాణి, రవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 98వ వార్డు శ్రీలక్ష్మీ నరసింహనగర్, భరత్‌నగర్, పంచాయతీ కాలనీ తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకుడు మామిడి దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎలమంచిలి ప్రసాద్, మళ్ల అప్పారావు, వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక జోనల్ పరిధిలో మంగళవారం 96.58 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. జోనల్ సచివాలయాల పరిధిలో 31,953 మంది పింఛన్‌దారులు ఉండగా 30,859 మందికి పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి గురువారం అందజేస్తామన్నారు.

గోపాలపట్నం: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలువురు లబ్ధిదారులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పంపిణీ చేశారు. పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి: జీవీఎంసీ 94, 95 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, సీహెచ్ అప్పలరాజు, జె.త్రినాథ్, బాలాజీ, బి. సత్యనారాయణ, తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

పెదగంట్యాడ: గ్రేటర్ 65వ వార్డు పరిధిలోని ప్రియదర్శిని కాలనీ, సంజీవకాలనీ, వికాస్ నగర్, భానోజీతోట ప్రాంతాల్లో పలువురికి పింఛన్లను కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పంపిణీ చేశారు. 75వ వార్డు నెల్లిముక్కు, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, సీతానగరం ప్రాంతాల్లో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు. 76వ వార్డు నడుపూరు, హెచ్‌బీ కాలనీ, బర్మాకాలనీ, రామచంద్రానగర్, రిక్షా కాలనీల్లో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు చేతుల మీదగా పింఛన్ల పంపిణీ జరిగింది.

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవ, క్రాంతినగర్, కాకరలోవ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు కార్పొరేటర్ గల్లా చిన్నా పెన్షన్లు అందజేశారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు జి.కృష్ణ, జె.నరసింగరావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగి, తదితరులు పెన్షన్లు పంపిణీలో పాల్గొన్నారు.

యోగా పోటీల్లో హెచ్‌సీ చిన్నారికి తృతీయ స్థానం

మల్కాపురం, అక్టోబరు 1: ఆలిండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్, యోగా క్లస్టర్ విభాగం 2023-24కు సంబంధించి యోగా మహిళల విభాగంలో మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ తనవరపు చిన్నారి తృతీయ స్థానంలో నిలిచారు. చండీగఢ్ రాష్ట్రంలోని బిలాయిపట్నం అగ్రసేన్ భవనంలో సెప్టెంబరు 23 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో ఆమె విశాఖ జిల్లా తరపున పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారు. గతంలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా సోమవారం ఆమె మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకారెడ్డి, డీజీపీ ద్వారకా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసి వారి అభినందనలు పొందారు. అలాగే సీపీ శంఖబ్రత బాగ్చీ, పలువురు ఉన్నతాధికారులు, సీఐ విద్యాసాగర్, తదితరులు చిన్నారిని అభినందించారు.


మెడల్‌తో చిన్నారి

పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా దీపారాధన

అగనంపూడి, అక్టోబరు 1: సనాతన ధర్మ పరిరక్షణ కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ 79వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నడక మైదానం సమీపంలో గల రామాలయం వద్ద దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, వీరమహిళలు దీపాలను వెలిగించారు. భ్రమరాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, పారాయణ సమితి ఆర్గనైజర్ చిత్రా రామారావు, తదితరులు పాల్గొన్నారు.


దీపారాధనలో పాల్గొన్న జనసేన నాయకులు


డాక్‌యార్డు పరిసరాలను పరిశీలిస్తున్న గణబాబు

డాక్‌యార్డు వంతెన పునర్నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

ఎస్‌బీసీ వంతెనపై రాకపోకల గురించి అధికారులతో చర్చిస్తాం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, అక్టోబరు 1: నేవల్ డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉద్యోగుల రాకపోకలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. మంగళవారం ఉదయం ఆయన నేవల్ డాక్‌యార్డు ప్రాంతాన్ని సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించాలని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ కోరారు. మేహాద్రిపేటలో ఉంటున్న పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తమ ప్రాంతం డాక్‌యార్డుకు చాలా దగ్గరలో ఉంటుందని, అయితే సంస్థకు చేరుకునేందుకు చుట్టూ తిరిగి సుమారు 13 కిలోమీటర్లు దూరం ప్రయాణించి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గం సురక్షితం కాదని, తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నామని, ఇటీవలే ఓ ఉద్యోగి మృతి చెందినట్టు గణబాబుకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఎస్‌బీసీ వంతెన మీదగా రాకపోకల సాగించే అంశాన్ని జిల్లా, నావికాదళం అధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్‌యార్డు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 'బెహరా' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో బెహరా విజయచైతన్య, తదితరులు

గోపాలపట్నం, అక్టోబరు 1: నరవ గ్రామంలోని బెహరా ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాలలో అమెజాన్ సంస్థ మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ ఎంపికల ద్వారా 53 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. కొలువులు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి: డీసీపీ

ఆటోనగర్, అక్టోబరు 1: విద్యార్థులు చిన్నతనం నుంచే మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని డీసీపీ తుహిన్ సిన్హా అన్నారు. 70వ వార్డు శ్రీనివాస నగర్‌లోని ట్వింకిల్ స్కూలులో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతులను పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు డీసీపీ జ్ఞాపికలు, బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సాధించాలనే తప నతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుంటే ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చన్నారు. స్కూల్ డైరెక్టర్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ కరుణకుమారి, ఉపాధ్యాయులు గీత, శిరీష, కల్యాణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో డీసీపీ తుహిన్ సిన్హా, తదితరులు

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

పెదగంట్యాడ, అక్టోబరు 1: జీవీఎంసీ 65వ వార్డు వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో ఈ నెల మూడు నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, ఉత్సవ కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు, ఎం.అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 1: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి బుధవారం వరకు బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా 52వ వార్డు పరిధి ఎన్ఏడీ గౌరీ నగర్‌లో పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ్ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. శిబిరంలో సుమారు 150 మందికి వైద్య సేవలందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కాశీవిశ్వనాథరాజు, పీవీఎస్ మాధవ్, మేడపాటి రవీంద్ర, బి.లక్ష్మీనారాయణ, విజయ్‌బాబు, డీపీ రమేశ్, సీహెచ్ మంజుల, లత, తదితరులు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న గణబాబు

87వ వార్డులో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

కూర్మన్నపాలెం, అక్టోబరు 1: మహాత్ముని అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ పయనించాలని ఏఎంహెచ్ కిరణ్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. మంగళవారం 87వ వార్డు సిద్ధార్థనగర్‌లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా పార్కులో శ్రమదానం చేసి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి టీడీపీ పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ఎం.రాము, బలిరెడ్డి నాగేశ్వరరావు, సత్తిబాబు, పరమానందం, విశ్వేశ్వరరావు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

అగనంపూడి, అక్టోబరు 1: పెందుర్తి నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా పోటీలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులందరూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ అప్పగింత

విశాఖపట్నం, అక్టోబరు 1: సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై జేబు నుంచి మొబైల్ (వీవో) జారవిడుచుకున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చవిదాస్‌కు ఆర్పీఎఫ్ సిబ్బంది తిరిగి మొబైల్ ఫోన్‌ను అప్పగించారు. ప్లాట్‌ఫామ్‌పై పెట్రోలింగ్ చేస్తున్న సోనాలి సోలంకి అనే ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్‌కు మొబైల్ కనిపించింది. దానిని పరిశీలిస్తున్న సమయంలో బాధితుడి నుంచి ఫోన్ వచ్చింది. ఆమెకు జరిగిన సంఘటన చెప్పగా వివరాలు నిర్ధారించుకుని ఆర్పీఎఫ్ సిబ్బంది, బాధితుడి బంధువు రోహిత్‌కు మొబైల్ అప్పగించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్షలు


పుట్ట బంగారమ్మవారి దేవాలయం దగ్గర దీక్షలో మహిళల మంత్ర జపం


శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో జనసేన నాయకులు, మహిళల పూజలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 1: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు ప్రసాదం అపవిత్రం జరిగిందని భావిస్తున్న నేపథ్యంలో స్వామివారికి ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ చేపట్టిన 11 రోజుల దీక్షకు మద్దతుగా గ్రేటర్ 42, 43, 44 వార్డులు సంయుక్తంగా నమో నారాయణాయ మంత్ర జపం 80 అడుగుల రోడ్డులోని పుట్ట బంగారమ్మవారి దేవాలయం దగ్గర మంగళవారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథిగా ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, వార్డుల అధ్యక్షులు గారపాటి లక్ష్మి, వరలక్ష్మి, దివాకర్, భాస్కర్, త్రినాథ్ పాల్గొన్నారు.

మర్రిపాలెం: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా 53, 54 వార్డుల జనసేన నాయకులు, వీరమహిళలు పంజాబ్ హోటల్ దరి సాయినగర్‌లో గల శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డుల జనసేన అధ్యక్షులు నీరుకొండ దివాకర్, వింజమూరి భాస్కర్, తాటిపాకల మాణిక్యాలరావు, పెద్దసంఖ్యలో వీరమహిళలు పాల్గొన్నారు.

అల్లిపురం: తిరుమల శ్రీవారి లడ్డును అపవిత్రం చేసిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు పలుకుతూ మంగళవారం స్థానిక 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయంలో దీపారాధన చేపట్టారు. కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, దక్షిణ జనసేన నాయకులు గోపీ కృష్ణ, వార్డు జనసేన అధ్యక్షుడు ఆకుల రాజుల ఆధ్వర్యంలో దీపారాధన చేశారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నీలమ్మ తల్లి సేవాసమితి కమిటీ సభ్యులు అప్పల రాజు, గణేష్ శ్రీను, వార్డు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజార్లలో ఖాళీ స్టాళ్ల కేటాయింపునకు 5న డ్రా

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న తొమ్మిది రైతుబజార్లలో సాయంత్రం పూట వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకోవడానికి రైతులకు అవకాశం కల్పించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం తెలిపారు. ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, సీతమ్మధార, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ, నరసింహనగర్, గాజువాక రైతుబజార్లలో 238 దుకాణాలు (స్టాళ్లు) ఖాళీగా ఉన్నాయన్నారు. రైతుబజార్లలో అవకాశం కోసం 2019 నుంచి వివిధ ప్రజాప్రతినిధుల ద్వారా 673 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, వారందరి పేర్లతో ఈ నెల 5న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో డ్రా తీసి 238 మందికి అవకాశం కల్పిస్తామన్నారు. ఎంపికైన రైతులకు నామినీగా ఉండటానికి రక్తసంబంధీకులు మాత్రమే అర్హులని, వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఎంపికైన వారు సాయంత్రం పూట మాత్రమే బజార్లలో విక్రయించాల్సి ఉంటుందన్నారు. డ్రా తీయబోయే జాబితా కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విశాఖపట్నం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూడవచ్చన్నారు.

చురుగ్గా ఈఎస్ఐ ఆస్పత్రి పనులు

... 5వ పేజీ తరువాయి

సుమారు రూ.28 కోట్లతో ఆధునికీకరించారు. అయితే షీలానగర్ ఆస్పత్రికి ఎవరైనా ఏదైనా ఆరోగ్య సమస్యపై వస్తే పరీక్షలకు గానీ, ఆపరేషన్లకు గానీ బయటకు వెళ్లకుండా అన్ని సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎవరికైనా ఎంఆర్ఐ స్కాన్, పెద్ద పెద్ద ఆపరేషన్లు అవసరమైతే మల్కాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కార్పొరేట్ ఆస్పత్రులకు పంపుతున్నారు. షీలానగర్ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఎంఆర్ఐ స్కానింగ్ అక్కడే చేస్తారు. అన్నిరకాల ఆపరేషన్లు నిర్వహిస్తారు.

త్వరలోనే తొలి బ్లాక్ ప్రారంభం

షీలానగర్ ఆస్పత్రి నిర్మాణం శరవేగంతో నిర్మాణం జరుగుతోంది. ఆస్పత్రి మొత్తం పూర్తయ్యేంత వరకు ఆగకుండా అందుబాటులోకి వచ్చిన భవనాలను వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము. ఏ బ్లాక్ ముందుగా పూర్తవుతుందో దానిని ప్రారంభించి సేవలు ప్రారంభించే యోచన ఉంది.

- పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ

జిప్ లైనర్, స్కై సైక్లింగ్...

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోతుంది. అక్కడ దిగిన తరువాత దాని కంటే ఎత్తుగా నిర్మించిన టవర్ ఎక్కి అక్కడి నుంచి ఇటు వైపు మళ్లీ డౌన్‌కు గ్రావిటీతో వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కైలాసగిరి కిందన రోప్ వే ఉంది. ఇది విద్యుత్ మోటార్లతో పనిచేస్తుంది. కానీ జిప్ లైనర్లు కేవలం గ్రావిటీ ఆధారంగానే పనిచేస్తాయి.

జిప్ లైనర్ అంటే...: రెండు టవర్ల మధ్య తీగ కడతారు. దానికి బేరింగ్స్‌తో నడిచే రోప్స్ వేలాడదీస్తారు. వాటిని పర్యాటకుల నడుముకు బిగిస్తారు. జారిపోకుండా పటిష్ఠంగా కడతారు. వాటిని వదలగానే ఇటు వైపు నుంచి అటు వెళతాయి. అలాగే అటు వదిలితే ఇటు వస్తాయి. గాలిలో వేలాడుతూ వెళ్లిన అనుభూతి కలుగుతుంది.

స్కై సైక్లింగ్...: టవర్లకు మధ్య తీగలు ఏర్పాటుచేసి, వాటిపై సైకిళ్లు నడిచేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ సైకిళ్లకు టైర్లు ఉండవు. తీగలపై బ్యాలెన్స్ అయ్యేలా రిమ్స్ మాత్రమే ఉంటాయి. వీటికి కిందన ఒక తీగ, పైన ఒక తీగ ఉంటాయి. సైకిల్‌పై పర్యాటకులు కూర్చొంటారు. ఇవి కూడా గ్రావిటీతోనే నడుస్తాయి. జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌లలో ఏది ఎక్కినా ఇటు నుంచి అటు వెళ్లి, తిరిగి అటు నుంచి ఇటు వచ్చేలా అనుమతిస్తారు. కైలాసగిరి రోప్‌వేకు ఆ సదుపాయం లేదు. ఇటు నుంచి కొండపైకి వెళ్లి అటు నుంచి రోడ్డు మార్గాన దిగిపోవలసి ఉంటుంది. అటు నుంచి కూడా రోప్‌వేలోనే రావాలంటే ప్రత్యేకంగా టికెట్ తీసుకోవలసి ఉంటుంది. వీటికి మాత్రం అలా కాకుండా ఇక్కడ జిల్ లైనర్ లేదా స్కై సైక్లింగ్ ఎక్కిన వారు అటు నుంచి వెనక్కి వచ్చే అవకాశం కల్పిస్తున్నారు.

టికెట్ ధరపై నిర్ణయం కమిషనర్‌దే

ఈ తరహా జిప్ లైనర్లు, స్కై సైక్లింగ్‌లకు కేరళలో మనిషికి రూ.150 చొప్పున టికెట్ పెట్టి వసూలు చేస్తున్నారు. ఇక్కడ టికెట్ ధర ఎంత అనేది వీఎంఆర్‌డీఏ కమిషనరే నిర్ణయిస్తారని ఈ పనులు పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బలరామరాజు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్ నడిపి, దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

ఉక్కులో ఉద్రిక్తత...

5వ పేజీ తరువాయి

ఎస్‌ఐలు, సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది భారీగా మోహరించారు.

కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు

- ఆన్‌లైన్‌లో రద్దు చేసిన గేటు పాస్‌లను తక్షణమే పునరుద్ధరించాలి
- బయోమెట్రిక్ యంత్రంలో వివరాలు తిరిగి నమోదు చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి, ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలి, పాత పద్ధతిలోనే గేటు పాస్‌లు మంజూరుచేయాలి, పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలి, యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది **-అఖిలపక్ష కార్మిక నాయకులు**

కాంట్రాక్టు కార్మికుల విషయంలో యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈడీ (వర్క్స్) కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్మిక వర్గాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ యాజమాన్యం చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేదని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికుల విషయంలో కుట్ర జరుగుతుందన్నారు. భారీ ఉద్యమాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆందోళనలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, పీవీ నగేష్, శ్రీనివాసరావు, అవతారం, ఎల్.సోంబాబు, నమ్మి రమణ, రామిరెడ్డి, ఉరుకూటి వెంకటరమణ, ఉద్యోగ సంఘ నాయకులు కేఎస్ఎన్ రావు, అయోధ్యరాం, బొడ్డు పైడిరాజు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లలో తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

నివేదిక తయారుచేసి జీవీఎంసీతోపాటు అగ్నిమాపక శాఖ, జీఎస్టీ అధికారులకు పంపిస్తామని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. స్పా/మసాజ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్టయితే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అపుస్మా అధ్యక్షునిగా సత్యనారాయణ



అక్కయ్యపాలెం, అక్టోబరు 1: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మెనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షునిగా అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఆయన అపుస్మా ప్రతినిధిగా చక్కని సేవలందించారు. ఎన్నికల అధికారిగా అపుస్మా మెంటర్ ఎ.కృష్ణారెడ్డి వ్యవహరించారు. ఆయన 2026 వరకు అధ్యక్ష పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు శక్తివంచన లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్సలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: పాండురంగాపురం బీచ్‌రోడ్డు ఏయూ యోగా విలేజ్‌లో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రమేష్‌బాబు తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యం చేస్తారన్నారు. కేజీహెచ్ పూర్వ సీనియర్ వైద్యాధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. గతంలో వైద్యులు రాసిన చీటీలు శిబిరానికి తీసుకురావాలని సూచించారు.

మెగా రక్తదాన శిబిరం

అల్లిపురం, అక్టోబరు 1: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన నాయకులు, ఫౌండేషన్ అధినేత భీశెట్టి గోపీకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి హాజరవుతారని చెప్పారు.

కనకమహాలక్ష్మికి కుంకుమార్చనలు

పూర్ణామార్కెట్, అక్టోబరు 1: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు జరిపి అమ్మవారికి అష్టదళ పద్మారాధన సేవల్లో భాగంగా 108 బంగారు పుష్పాలతో భక్తుల సమక్షంలో పూజలు చేశారు. దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

మిథున్‌కు వీఎఫ్ఎస్ అభినందనలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: భారతీయ సినిమా పరిశ్రమలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ప్రఖ్యాత సినీనటుడు మిథున్ చక్రవర్తిని ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం హర్షణీయమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ అవార్డుకు మిథున్ అన్ని విధాలా అర్హులని తెలిపారు .కేంద్రమంత్రి ప్రకటనపై వైజాగ్ ఫిల్మ్ సొసైటీ శుభాకాంక్షలు తెలియజేస్తుందన్నారు. మిథున్‌కు అభినందనలు తెలియజేస్తూ మెయిల్ పంపామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

మర్రిపాలెం, అక్టోబరు 1: కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురిని ఐదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం హాజరుపరచగా ఆరుగురికి రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష విధించారని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సెలవు ప్రకటనపై హర్షం

సీతమ్మధార, అక్టోబరు 1: సీతమ్మధార రైతు బజార్‌కు మంగళవారం సెలవు ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సెలవు కావడంతో బజారును కడిగి శుభ్రం చేశారు.

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలు వద్దు'

అక్కయ్యపాలెం, అక్టోబరు 1: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజారు రోడ్డులో మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రజా ఆస్తులైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ పరిశ్రమలను బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మకానికి పెట్టి దేశసంపదను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. బొగ్గు ముడి సరకును ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, జి.శ్రీనివాస్, పి.సాయికుమార్, జి.గణేష్, ఎరుకునాయుడు, సూరిబాబు, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్‌కే కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలు నిలిపివేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాల నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.టి.ప్రసాద్

మురళీనగర్, అక్టోబరు 1: జన సమ్మర్ధ ప్రాంతాలుగా ఉండే హోటళ్లలో నిర్వాహకులు కచ్చితమైన ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని జిల్లా సహాయ అగ్ని మాపకశాఖ అధికారి కె.వి.టి.ప్రసాద్ సూచించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని మారియట్ త్రీస్టార్ హోటల్ వద్ద మంగళవారం మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద నివారణ సాధనాలు అందుబాటులో ఉంటే అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు త్వరితగతిన ఎలా బయటపడవచ్చునో సిబ్బందితో చేపట్టిన మాక్‌డ్రిల్‌లో చూపించారు. హోటల్ సిబ్బందిని సమావేశ పరచి తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్‌మెన్ చిరంజీవి, ఆర్.చిన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



ర్యాలీలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 1: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉద్యోగులు, సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్ నూతన ప్రణాళికలు, ఇతర అంశాలను ప్రజలకు తెలియజేసేలా ర్యాలీ చేపట్టారు. ఏజీఎం టీడీ పాల్ విలియమ్స్ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీజీఎం (ఆపరేషన్స్) జి.ఆడమ్స్, డీజీఎంలు ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, బీవీవీ నగేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

దొండపర్తి, డాబాగార్డెన్స్, సీతంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం దొండపర్తి, డాబాగార్డెన్స్, సీతంపేట ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు గొలగాని వీరారావు బుజ్జి సారపిల్లి గోవింద్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఇతర అధికారుల బృందం, వార్డు టీడీపీ అధ్యక్షులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండె పరిరక్షణకు వ్యాయామం అవసరం


వాక్‌థాన్‌లో పాల్గొన్న గుండె వైద్యనిపుణులు, వైద్యవిద్యార్థులు, స్థానికులు

మహారాణిపేట, అక్టోబరు 1: మహిళలు, యువతలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, వీటి నివారణకు వ్యాయామం అవసరమని ప్రముఖ కార్డియాలజిస్ట్, మహిళా వైద్య నిపుణురాలు వి.సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డే వారోత్సవాల సందర్భంగా ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు అవగాహన కల్పిస్తూ 'గుండె కోసం నడక' (వాక్ ఫర్ హార్ట్) లక్ష్యంతో మంగళవారం సాగరతీరంలో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. డాక్టర్ సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇంటి పనులతోనే వ్యాయామం అయిపోతుందని భావిస్తున్నారని, కాని ఇకపై నడక వంటి వ్యాయామం చేయక తప్పదని ఆమె అన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లతోనే ప్రమాదమని భావిస్తున్నారని, ఇకపై గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకత ఏర్పడిందని స్పష్టంచేశారు. మద్యపానం, ధూమపానం, తీవ్రమైన ఒత్తిడి, వ్యాయామం లేకపోవటంతో యువతకు గుండెపోటు సమస్య పెరిగినట్లు తేలిందన్నారు. ప్రజలను చైతన్యపరచడానికే వాక్‌థాన్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె వ్యాధులను మాత్రమే ముందుగా గుర్తించి ప్రమాదాన్ని నివారించగలమన్నారు. ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ అనిల్‌కుమార్ మహాపాత్రో, కార్డియోథొరాసిక్ అండ్ ఎండో వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ హరివదన్ లుక్కా, డాక్టర్ జాన్ ఎస్ వెస్లీ, ఇండస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎస్.శ్రీధర్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవిష్యత్తు అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ పి.సంపత్‌కుమార్ నగరంలో చేపట్టిన ప్రాజెక్టులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. జీవీఎంసీ ఆదాయ, వ్యయాలతోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, నగరంలో రోడ్ల అభివృద్ధి, నీటి సరఫరా ప్రణాళికలు, క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, యూసీడీ విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ నగరంలో ప్రతి కుటుంబానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరమంతా వీధి దీపాలు వెలిగేలా చూడడంతోపాటు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన 157 చోట్ల కొత్తగా లైట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం అవసరమైనా నిధుల సమస్య ఉందని ఎంపీకి కమిషనర్ వివరించగా, కేంద్రంతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడలను ప్రోత్సహించడం కోసం 'ఖేలో ఇండియా' కింద కేంద్రం నుంచి నిధులను రాబట్టేందుకు కృషిచేస్తానన్నారు. గెడ్డల ఆక్రమణకు అడ్డుకట్ట వేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం కృషిచేయాలని ఎంపీ సూచించారు. డ్రైనేజీల నుంచి మురుగునీరు సముద్రంలో కలుస్తోందని, 2026 నాటికి దీనికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. గ్రామకంఠంలో ఉండే ఇళ్లకు ఆస్తి పన్ను విధించే అవకాశాలు పరిశీలించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులకు కారణమవుతున్న బడ్డీలు తొలగించాలని, జీవీఎంసీ స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన ముఖ్యమైన ప్రాజెక్టులపై నివేదిక ఇస్తే సీఎస్ఆర్ ద్వారా నిధుల సమీకరణకు కృషిచేస్తామన్నారు. యూసీడీ ద్వారా టిడ్కో ఇళ్లను అరులకు సత్వరం అందజేయాలని ఆదేశించారు. ఫుడ్ కోర్ట్‌లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీవీఎంసీ వెబ్‌సైట్, చాట్‌బాట్‌ను మెరుగ్గా నిర్వహించేందుకు యువత నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నగర అభివృద్ధికి తమ సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు సమస్యలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పెతకంశెట్టి గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేలో ఇకపై స్వచ్ఛతా పక్వాడా

విశాఖపట్నం, అక్టోబరు 1: వాల్తేరు రైల్వేలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ గత నెల 14 నుంచి స్వభావ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత పేరిట నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ముగించి, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 15 వరకు కొనసాగే స్వచ్ఛతా పక్వాడాలో రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాలు, వర్కుషాపులు, నిర్వహణ డిపోలు, ఆసుపత్రులు, రైల్వే నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించి క్లీన్ అండ్ గ్రీన్ ఇండియాపై అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. కేవలం వాల్తేరు డివిజన్‌లోనే కాకుండా తూర్పుకోస్తారైల్వే జోన్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం తమ ప్రాంగణాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రతను పాటించడంపై అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

'పోర్టు ఆసుపత్రి కోసం ఉద్యమించాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 1 : పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ కాకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. స్థానిక నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు ఆసుపత్రి వద్ద మంగళవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రస్తుతం 80 పడకలతో దశాబ్దాల తరబడి 35 వేల కుటుంబాలకు సేలందిస్తోందని గుర్తు చేశారు. దీన్ని పీపీపీ పద్ధతిలో 300 పడకలతో ప్రైవేటు వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. సీఐటీయూ నాయకులు పద్మనాభరాజు, కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, వీర రాఘవులు, రామారావు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు అవసరం'

జగదాంబ కూడలి, అక్టోబరు 1: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ 4న నగరంలోని ఆశీలుమెట్ట, ద్వారకానగర్, సెంట్రల్ పార్క్, జీవీఎంసీ, గాంధీ విగ్రహం వరకు భవన నిర్మాణ కార్మికులతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులది కీలకపాత్ర



రికార్డులు తనిఖీ చేస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, అక్టోబరు 1: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలకపాత్ర అని కమాండెంట్ కె.వి.మురళీ కృష్ణ తెలిపారు.మంగళవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహిచారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పరేడ్, పీటీ, డ్రిల్, వేషన్ క్లాస్, మాబ్ ఆపరేషన్ తదితర కీలక అంశాలను పరిశీలించారు. బెటాలియన్‌లోని ఎంటీ గ్రూప్, క్వార్టర్ మాస్టర్, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీస్‌లను క్షుణంగా పరిశీలించారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానందరావు, పి.సత్యం, ఇలియసాగర్, నారాయణరావు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

దివీస్ నిధులతో సీహెచ్‌సీలో సదుపాయాల కల్పన

భీమునిపట్నం, అక్టోబరు 1: భీమిలి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిప్పాడ దివీస్ యాజమాన్యం రూ.12 లక్షల సీఎస్ఆర్ నిధులతో పలు సౌకర్యాలను, అభివృద్ధి పనులు నిర్వహించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ తెలిపారు. మంగళవారం సంబంధిత పనులను ఆ కంపెనీ ఈఎస్ఆర్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఫణి కుమార్ మాట్లాడుతూ, ఈ ఆస్పత్రిలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దివీస్ సంస్థ ముందుకు వచ్చి ఆపరేషన్ థియేటర్‌లో సదుపాయాలను, ఎక్స్‌రే ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే, ఆస్పత్రిలో ఇంటర్నల్ సీసీ రహదారిని నిర్మించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధి కె.నరసింహ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్రిందా వైద్యశాలలో కేన్సర్‌కు అరుదైన శస్త్ర చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న ఆస్పత్రి డైరెక్టర్ వంశీధర్ ఫ్రూటే

ఆరిలోవ, అక్టోబరు 1: ఆరిలోవ హెల్త్ సిటీలోని వ్రిందా కేన్సర్ వైద్యశాలలో అరుదైన సర్జరీ చేసి 38 ఏళ్ల వెంకట్ అనే వ్యక్తిని కాపాడినట్టు ఆస్పత్రి చీఫ్ సర్జన్, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వంశీధర్ పూట్రే తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా రాజాంనకు చెందిన వెంకట్ కాలర్ బోన్‌కు క్యాన్సర్ సోకిందన్నారు. ఆ ఎముకకు ఆధునాతన రీతిలో సర్జరీ చేసి వ్యాధి నయం చేసినట్టు చెప్పారు. అంగవైకల్యం లేకుండా జీవించేలా చేశామని వివరించారు. చాలా అరుదుగా ఇటువంటి శ స్త్ర చికిత్స చేయడంలో విజయం సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో అంకాలజిస్టు విజయ లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్టు ప్రేమచంద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), అక్టోబర్ 1: మండలంలోని కృష్ణంరాజుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రెండో విడత సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను మంగళవారం విద్యార్థులకు పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ రమణ అందించారు. పుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

వెల్లంకిలో కేంద్ర బృందం పర్యటన

ఆనందపురం, అక్టోబరు 1: మండలంలోని వెల్లంకి, కణమాం పంచాయతీల్లో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. పంచాయతీలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల అమలు పనితీరును పరిశీలించారు. ఉపాధి పథకం పనుల తీరును పరిశీలించారు. నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

సినిమా గైడ్

● **సత్యం సుందరం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 48, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 24, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 22, క్యారెట్ 40 దొండకాయలు 42, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 66, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

రామవరంలో రోడ్డును విక్రయించిన ఘనుడు!

- తవ్వకాలు చేపట్టిన కొనుగోలుదారుడు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



రోడ్డు తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

ఆనందపురం, అక్టోబరు 1: మండలంలోని రామవరంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన రహదారిని విక్రయించారు. సర్వే నంబర్లు 271/1, 273/1, 273/2, 275/2, 274/1లకు ఆనుకుని ఉన్న రోడ్డును పక్కనున్న స్థల యజమాని విక్రయించడంతో కొనుగోలుదారుడు ఇందులో తవ్వకాలు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డును రామవరం గ్రామం నుంచి గండిగుండం పరిధిలోని గుర్రంపాలెం గ్రామంలోని డీ పట్టా భూముల్లో పీఎస్ఎల్ కంపెనీ వరకు అప్పటి ఎంపీ సబ్బం హరి నిధులు విడుదల చేసి 2006లో పూర్తి చేయించారు. అప్పట్లో నలభై అడుగుల రోడ్డును ప్రజల సౌకర్యార్థం నిర్మించారు. అయితే, ఇటీవల డీ పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేయడంతో భూ యజమాని రోడ్డుతో సహా ఈ స్థలాన్ని విక్రయించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో కొనుగోలుదారుడు రోడ్డును తొలగించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నా వినిపించుకోలేదు. దీనిపై గ్రామానికి చెందిన అగరపు దేముడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై సమగ్ర విచారణ జరిపి రోడ్డును పరిరక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పట్టాలు పంపిణీ చేయండి

- కలెక్టరుకు ఎమ్మెల్యే వెలగపూడి వినతి

ఎంవీపీకాలనీ, అక్టోబరు 1: గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జీవో 296, 388, 279ల ప్రకారం పలు వర్గాలకు భూములను క్రమబద్ధీకరించిన సందర్భంగా వీరికి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టరుకు పంపించారు. అప్పట్లో పట్టాల కోసం కొన్ని వర్గాల నుంచి నామమాత్ర రుసుంతో లబ్ధిదారులకు వాయిదాలు చెల్లించే అవకాశం కల్పించినట్టు గుర్తు చేశారు.అనంతరం ఆ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ మధ్యలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోమిగిలిన మొత్తం చెల్లించిన వారితో పాటు బకాయిలు చెల్లించేందుకు సిద్ధంగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బకాయి చెల్లించని దుకాణాలకు తాళాలు

సిరిపురం, అక్టోబరు 1: వీఎంఆర్డీఏకు చెందిన వాణిజ్య సముదాయాల్లో దుకాణదారులు, లీజ్ హోల్డర్లు సకాలంలో నెలసరి అద్దెల మొత్తం చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బకాయిలు ఉన్న 75 దుకాణాలకు తాళాలు వేశారు. అలాగే, బకాయి దారులనుంచి సుమారు రూ.73 లక్షలు వసూలైనట్టు చెప్పారు.

ఇండోర్ స్టేడియంలో సదుపాయాలు కల్పనకు చర్యలు

- వీఎంఆర్‌డీఏ కమిషనరు కేఎస్ విశ్వనాథన్



భీమిలిలోని ఇండోర్‌స్టేడియంను పరిశీలిస్తున్న కమిషనరు విశ్వనాథన్

భీమునిపట్నం, అక్టోబరు 1: భీమిలి కుమ్మరిపాలెంలోని వుడా ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వీఎంఆర్‌డీఏ కమిషనరు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. ఈ వుడా ఈ స్టేడియంను నిర్మించింది. ప్రస్తుతం జీవీఎంసీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఇండోర్ స్టేడియంలో ఉడెన్ ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మించాలని పలువురు క్రీడాకారులు ఈ సందర్భంగా కోరారు. వీటిపై జీవీఎంసీ కమిషనరుతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని విశ్వనాథన్ అధికారులు సూచించారు. ఈపర్యటనలో జోన్ వన్ భీమిలి జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి, పబ్లిక్ వర్క్స్ ఏఈ ఎ.సుమాన్, స్పోర్ట్సువిభాగం అధికారులు పాల్గొన్నారు.

విలువలతోనే వైద్య విద్యలో రాణింపు

- ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఎండాడ, అక్టోబరు 1: వైద్య వృత్తిలో రాణించాలంటే అంకితభావంతో పాటు సామాజిక బాధ్యత ఉండాలని గీతం కళాశాల అధ్యక్షుడు, ఎంపీ. శ్రీభరత్ అన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాలలో 2024 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వైట్ కోట్ ధారణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్య రంగంలోకి సాంకేతిక పరిజ్ఞానం రానున్న రోజుల్లో కీలక భూమిక వహించనున్నదన్నారు. వీటిని వినియోగించడంతోపాటు రోగులతో చక్కగా మెలుగుతూ వారికి చికిత్సనందించాలన్నారు. ఒత్తిడికి లోనవకుండా వైద్య విద్యార్థులు వృత్తిలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించేవారు నిరంతర విద్యార్థిగా ఉండాలని, విలువలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ మానవత విలువలు, సమాజం పట్ల బాధ్యతతో వైద్య వృత్తిలోకి ప్రవేశించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు , జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి , జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్పీ రావు, గీతం ఆసుపత్రి సూపరిడెంటెంట్ డాక్టర్ వసంత కుమార్ మాట్లాడారు. వైద్య విద్యార్థులకు సీపీ తెల్లకోట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు వైద్య వృత్తి పట్ల నిబద్ధత, విలువలతో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

భీమిలి నియోజకవర్గంలో 94 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

భీమునిపట్నం, అక్టోబరు 1: భీమిలి నియోజకవర్గ పరిధిలో మంగళవారం 94 శాతానికి పైగా ప్రభుత్వ సామాజిక పింఛన్లను పంపిణీ పూర్తయినట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయ వర్గాలు తెలిపారు. భీమిలి అర్బన్, భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలలో, జీవీఎంసీ వార్డుల్లో లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు, సచివాలయం సిబ్బంది, పార్టీ కార్యకర్తలు వెళ్లి ఈ పింఛన్లను అందించినట్టు చెప్పారు. మొత్తం 1,49,090 మంది లబ్ధిదారులకు గాను, రూ.64 కోట్లు పంపిణీ చేసినట్టు వివరించారు.

పెదవాల్తేరు: గ్రేటర్ 20వ వార్డు పెదవాల్తేరు, గాంధీ బొమ్మ సెంటర్, కొత్తపేట, మద్దివారి వీధి, ముసనబువారి వీధి తదితర ప్రాంతాల్లో శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు పెన్షన్లు పంపిణీ చేశారు.జోన్-1 మీడియో కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, మరడ సీతన్న, శివారెడ్డి, గోవింద్ సీహెచ్ జ్యోతి, గోపి, సచాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్): భీమిలిజోనల్ కార్యాలయపరిధిలో నాలుగు వార్డుల పరిధిలో మంగళవారం 8432 పింఛన్లను పంపిణీ చేసినట్టు జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నరాణి తెలిపారు. మొత్తం 8656 పింఛన్లకు.. 8432 మాత్రం పంపిణీ పూర్తి చేసినట్టు వివరించారు.

సింహాచలం: 98వ వార్డులో కార్పొరేటర్ పీవీ నరసింహంపర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ జరిగింది.

కొమ్మాది: ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. పలుచోట్ల జరిగిన పంపిణీ కార్య క్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, జనసేన అధ్యక్షుడు దేవరశివ, నాగోతి అనిత పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 7 వ వార్డు పరిధిలో మంగళవారం 90 శాతం మంది లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు , జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక రంగ విస్తరణలో ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం : ఎంపీ

ఎండాడ, అక్టోబరు 1: మౌలిక రంగ విస్తరణలో ప్రభుత్వంతోపాటు ప్రైవేటు రంగం కలిసి వచ్చినట్టయితే మంచి ఫలితాలు సాధించి అభివృద్ధికి వీలవుతుందని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) ఉత్తరాంధ్ర జోన్, విశాఖ శాఖల సంయుక్తంగా ఎండాడ స్కైపార్క్‌లో ప్రజాప్రతినిధులతో మీట్‌అండ్ గ్రీట్ పేరుతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడంతోపాటు నిర్మాణ రంగాన్ని మరింత బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. రాష్ట్ర నరెడ్కో అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు నివాస గృహాన్ని సరసమైన ధరలతో అందించడమే తమలక్ష్యమని వివరించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, ఎంఎం కొండయ్య, భాష్యం ప్రవీణ్, గౌతు శిరీష, బండారు సత్యనారాయణ మూర్తి , వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధికి, విధానపరమైన నిర్ణయాల్లో నరెడ్కో సంస్థను భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో నరెడ్కో సభ్యులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



పార్కులో మొక్కలు పరిశీలిస్తున్న విద్యార్థులు

పెదవాల్తేరు, అక్టోబరు 1: నగరంలో పెదవాల్తేరు రాణిచంద్రమ ణి దేవి ఆసుపత్రి ఆవరణలోని బయోడైవర్సిటీ పార్కును మంగళవారం హెచ్‌పీఎన్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ రవీంద్ర ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో అరుదైన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. అధ్యా పకులు డాక్టర్ సత్యనారాయణ, రవికుమార్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కోయిల్ తిరుమంజనం

సింహచలం, అక్టోబరు 1: మహాలయ పక్షాలు ముగియటంతో అప్పన్న ఆలయంలో మంగళవారం కోయిల్ తిరుమంజన సేవను నిర్వహించారు. దానిలో భాగంగా మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవకు ఆలయ ద్వారాలు మూసివేసి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేశారు. ఆ సమయంలో పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, దేవాలయ సిబ్బంది, భక్తులు కలిసి స్వామివారి దీపారాధనలకు, నీరాజనాలు సమర్పించేందుకు వినియోగించే ఇత్తడి సామగ్రిని శుభ్రపరచారు. పరిసరాలను శుభ్రపరచి ముగ్గులు వేశారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు: సీపీ



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

రామ్‌నగర్, అక్టోబరు 1: వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులో హెల్ప్ ఏజ్ ఇండియా వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వాక్‌థాన్ సీపీ శంఖబ్రత బాగ్చీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూవృద్ధులు, పెద్దలను గౌరవించటం మన సాంప్రదాయమన్నారు.తల్లిదండ్రులను నిరాదరణతోవృద్ధాశ్రమాలకు తరలించవద్దన్నారు. ఈ కార్యక్రమంలోసీనియర్‌సిటిజన్లు, జిల్లా వయోవృద్ధుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

తగరపువలస:తగరపువలస బంగ్లామెట్ట పాఠశాలలో మంగళవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. వృద్ధులపై చూపాల్సిన ప్రేమానురాగాలను ఉపాధ్యాయులు అప్పలరాజు రమేశ్, మల్లిక, నాగమణి వివరించారు.

బీచ్‌లో కూరుకుపోయిన కారు

భీమునిపట్నం, అక్టోబరు 1: భీమిలి బీచ్‌లో సరదాగా తిరుగుదామని దిగిన సందర్శకుల కారు ఇసుకలో కూరుకుపోయింది. మంగళవారం నగరం నుంచి కారులో వచ్చిన ఇద్దరు సందర్శనకు వచ్చారు. బీచ్‌లో ఒడ్డున కారును నడిపారు. అయితే, ఓ మలుపు వద్ద ఇసుకలో కెరటాలకు ఒడ్డున కూరుకుపోయింది. దీంతో మత్స్యకారులతో కారును బయటకు తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తగరపువలసనుంచి జేసీబీని తీసుకువచ్చి ఎట్టకేలకు కారును బయటకు తీశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

ఆరిలోవ, అక్టోబరు 1: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కిరణ పాల్ హెచ్చరించారు. 11 వ వార్డు రవీంద్రనగర్‌లో జీవీఎంసీకి చెందిన 200 గజాల స్థలాన్ని గతంలోమహిళా సామాజిక భవనం నిర్మాణానికి కేటాయించినట్టు చెప్పారు. దీనికి ఆనుకుని మిగిలిన స్థలం ప్రభుత్వ అవసరాలకు వినియోగించనున్నట్టు చెప్పారు. దీనిని ఎవరైనా ఆక్రమిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించామన్నారు.హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్యాముల్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా రేపు

భీమునిపట్నం, అక్టోబరు 1: భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్.మురళీకృష్ణ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, బీటెక్, డిగ్రీ చేసిన వారు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాలో డా.రెడ్డీస్ లేబొరేటరీస్, టెక్ విస్సన్ సాఫ్ట్ వేర్ పివిటి లిమిటెడ్, బిగ్ బాస్కెట్, పేటమ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

ఆనందపురం, అక్టోబరు 1: సేంద్రీయ ఎరువులు వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో సీహెచ్. సంధ్య రత్నప్రభ పేర్కొన్నారు. మంగళశారం మండలంలోని శొంఠ్యాం, మామిడిలోవ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముందుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస చక్రవర్తి, కె.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని గొల్లపాలెం, బాందేవుపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారలుఉ పంటల నమోదు , ఎరువుల యాజమాన్యం, పురుగుమందుల వాడకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్ శాఖ ద్వారా అందిస్తున్న రైతుబంధు పథకం వివరాలను తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవో ఎంవీఎస్ చలం, మార్కెటింగ్ అధికారి మేరీకుమారి, ఏఈఓ శ్రీనివాస్, నాయకులు పైడినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పద్మనాభం విద్యార్థులు ఎంపిక



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పద్మనాభం, అక్టోబరు1: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా బుచ్చియ్యపేట మండలం దిబ్బిడి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పదో తరగతి చదువుతున్న కె.మేఘన, టి.వృధ్వీ, ఎనిమిదో తరగతి విద్యార్థి నిఎం.సుస్మితప్రతిభ చూపిరాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

భీమిలి విద్యార్థినుల ప్రతిభ..

భీమునిపట్నం: మండల పరిధి చిట్టివలస హైస్కూల్‌లో మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన స్థానిక కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చందవరపు కుమార్ అభినందించారు. ఈ పోటీలలో అండర్ 17 కబడ్డీలో పదో తరగతి విద్యార్థిని యు.తేజశ్రీ, అండర్ -14 కబడ్డీలో 9వ తరగతి విద్యార్థిని కె.నవ్యశ్రీ, అండర్ -17 ఖోఖోలో పదో తరగతి విద్యార్థిని పి.కావ్య, 6వ తరగతి విద్యార్థిని శ్రీలలిత యోగాలో, రన్నింగ్‌లో 9వ తరగతి నిరీష సత్తా చాటారన్నారు. చోడవరంలో జరిగిన అండర్ 19 కబడ్డీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె.దీపిక ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి తదితరులువారిని అభినందించారు.

మహాత్మునికి ఘన నివాళి



ర్యాలీ చేస్తున్న చిన్నారులు

పెదవాల్తేరు, అక్టోబరు 1: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని మంగళవారం బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాల విద్యార్థులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ వేషధారణలో పలువురు విద్యార్థులుపాటలను ఆలపించారు. తొలుత ర్యాలీని పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపల్ కె మధురవాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నాయి బ్రాహ్మణులకు ఇళ్లు మంజూరు చేయాలి'

తగరపువలస, అక్టోబరు 1: నాయీ బ్రాహ్మణులకు ఇళ్ళ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తగరపువలస, చిట్టివలస పరిధిలోని వీరు మంగళవారం సంఘంగా ఏర్పాటై కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సం ఘ గౌరవ అధ్యక్షుడిగా గోవాడ సతీష్‌కుమార్, అధ్యక్షుడిగా ఎర్రవరపు శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా చిప్పాడ కనకరాజు, కోశాధికారిగా పట్నాల హేమసుందర్, ఉపాధ్యక్షుడిగా సలారపు శ్రీను, సహాయ కార్యదర్శిగా గోవాడ బాబూరావు, సభ్యులు ఎన్నికయ్యారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు

కొమ్మాది,అక్టోబరు 1: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పి.ఎం.పాలెం సృజనా పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 పాఠశాలలనుంచి 22 బృందాలుగా 66 మంది విద్యార్థులకు జోన్‌స్థాయిలో పరీక్షలు నిర్వహించారు. జనవిజ్ఞానవేదిక జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ శాస్త్రీయవిజ్ఞానంపై ఎనిమిది, తొమ్మిది, పదవతరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు మురళీధర్, అప్పలరెడ్డి, నరసింహమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ షరీఫ్, ప్రసాద్‌పాల్గొన్నారు.

ఏబీసీ నూతన కార్యవర్గం

భీమునిపట్నం, అక్టోబరు 1: అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానికంగా సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా ది సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మునిసిపల్ మాజీ కౌన్సిలరు గొలగాని నరేంద్రకుమార్, కోశాధికారిగా సంతోష్‌ను ఎన్నుకున్నారు. అలాగే, ఏబీసీ గౌరవాధ్యక్షుడిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత గంటా రవితేజను సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా అడిదం అంజనీకుమార్ ఎన్నుకున్నారు. అనంతరం, నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, త్వరలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు తీర్మానాన్ని ఆమోదించామన్నారు. కార్యక్రమంలో ఏబీసీ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడ దసరా ఉత్సవాలకు సింహాచలం సిబ్బంది

సింహచలం, అక్టోబరు 1: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3 నుంచి జరుగనున్న దసరా ఉత్సవాలలో భక్తులకు సేవలందించేందుకు సింహాచల దేవస్థానానికి చెందిన సిబ్బందిని డిప్యూటేషన్‌పై విధులు కేటాయిస్తూ దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సింహాచలం దేవస్థానం నుంచి పలువురు మంగళవారం విజయవాడ బయలుదేరి వెళ్లారు.

సామాన్యులపై నిత్యావసరాల ధరల భారం: సీపీఎం

మధురవాడ, అక్టోబరు 1: నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, సామాన్య కుటుంబాలు జీవనం కొనసాగించలేకపోతున్నాయని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించాలని కోరుతూ మధురవాడ మార్కెట్ వద్ద మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మధురవాడ జోన్‌కమిటీ కార్యదర్శి డి.అప్పలరాజు, నాయకులు పి.రాజుకుమార్, భారతి, శారద, సుజాత, తులసి, వాసంతి, ప్రసన్న పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ తగదు: సీపీఎం

ఆరిలోవ: విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరించడం తగదని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆరిలోవ బీఎస్ఆర్‌నగర్‌లో మంగళవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ బీఎస్ఆర్‌నగర్‌లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. అండర్ గౌండ్ డ్రైనేజీలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. నాగరాజు, ఎ. రమణ, జి. నాగరాజు, ఎస్. గౌరి, ఆర్. మణి, ఎం. భారతి, రాము ఎన్. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశు భ్రతతో వ్యాధులు దూరం

మధురవాడ, అక్టోబరు 1: పరిసరాల శుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జీవీఎంసీ 7 వ వార్డు కార్పొరేటర్, స్థాయిసంఘం సభ్యురాలు పిళ్లా మంగమ్మ అన్నారు. వాంబేకాలనీలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా జోన్- 2 జడ్సీ పి. సింహాచలం , టీడీపీ నేత పిళ్లా వెంకటరావు తదితరులతో కలసి వీధులను శుభ్ర పరిచారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఆరోగ్య సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఆనందపురం:నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేశ్‌కుమార్ తెలిపారు. పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులువాడ, బిపిక ళ్లాలు తదితర పంచాయతీల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.